సాక్షి
అనకాపల్లి
బుధవారం । 25 । డిసెంబర్ । 2024

ప్రేమ కాంతులు

ఊరూరా క్రిస్మస్ శోభ

విద్యుత్ ధగధగలతో చర్చిలు, ఇళ్లు



విద్యుత్ కాంతులతో ముస్తాబైన చోడవరం గాంధీ గ్రామం ఆర్‌సీఎం చర్చిలో ప్రత్యేకంగా వేసిన ఏసుక్రీస్తు జననం సెట్

ఊరూపా క్రిస్మస్ సందడి నెలకొంది. చర్చిలు, క్రైస్తవుల ఇళ్లలో కాంతులు విరజిమ్ముతున్నాయి. అనకాపల్లిలోని క్యాథలిక్ సంఘం చర్చి, సెంటినరీ ఆంధ్ర బాప్టిస్ట్ చర్చి, చోడవరం గాంధీగ్రామంలో ఆర్‌సీఎం చర్చి, యలమంచిలిలోని రోమన్ క్యాథలిక్ చర్చి, **మాడుగుల** ఆర్‌సీఎం చర్చిలు కళ్లు మిరుమిట్లు గొలిపేలా విద్యుత్ అలంకరణలతో జిగేల్ మంటున్నాయి. మరోవైపు క్రిస్మస్ షాపింగ్‌తో మార్కెట్లు కిటకిటలాడాయి. జిల్లాలోని కొన్ని చర్చిల్లో మంగళవారం అర్ధరాత్రి నుంచి క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. పలువురు ఇళ్లల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏసు క్రీస్తు పుట్టుకను తెలియపరిచే రీతిలో వివిధ ఘట్టాలను చర్చిల్లో ఏర్పాటు చేశారు.



మాడుగుల ఆర్సీయం చర్చిలో బాలయేసు



యలమంచిలి బైపాస్ రోడ్డులో రోమన్ కేథలిక్ చర్చి



అనకాపల్లి క్యాథలిక్ సంఘం చర్చిలో ప్రార్థనలు



నర్సీపట్నంలోని ప్రైవేట్ పాఠశాలలో ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో చిన్నారుల సందడి

సూక్ష్మరూపంలో జీసస్



నక్కపల్లి: మండలంలో చినదొడ్డిగల్లుకు చెందిన సూక్ష్మ కళాకారుడు డాక్టర్ గట్టెం వెంకటేష్ చార్‌కోల్ పెన్సిల్ ముల్లుపై జీసస్ బొమ్మను చెక్కాడు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని పెన్సిల్ మొనపై ఈ బొమ్మ తయారు చేసినట్టు వెంకటేష్ తెలిపాడు. ఈ బొమ్మ రూపొందించడానికి మూడుగంటల సమయం పట్టిందన్నాడు. పొడవు 18మిమి, వెడల్పు 8మిమితో ఈ జీసస్ రూపాన్ని తయారు చేసానని తెలిపాడు. తన సూక్ష్మ కళాఖండాల ద్వారా వెంకటేష్ గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించాడు.



న్యూస్‌రీల్

కరుణామయుని ఆశీస్సులు మెండుగా ఉండాలి

జిల్లా ప్రజలకు మాజీ డిప్యూటీ సీఎం బూడి క్రిస్మస్ శుభాకాంక్షలు



తారువ సెమీ క్రిస్మస్ వేడుకలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: కరుణామయుడైన ఏసు క్రీస్తు దీవెనలు, ఆశీస్సులు ప్రజలపై ఎల్లప్పుడూ మెండుగా ఉండాలని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు ఆకాంక్షించారు. తారువ ఏసుక్రీస్తు ప్రార్థన మందిరంలో మంగళవారం రాత్రి జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి పంచారు. క్రైస్తవ సోదరులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఏసు క్రీస్తు చూపిన మార్గంలో సాటి వారిపై కరుణ, ప్రేమ, క్షమ, సహనంతో మెలగాలని సూచించారు. ఫాస్టర్ జాన్‌పాల్ క్రిస్మస్ సందేశం వినిపించారు. జెడ్పీటీసీ సత్యం పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే పరేడ్‌కు దివ్యశ్రీ



దివ్యశ్రీ, విద్యార్థిని

అనకాపల్లి: ఢిల్లీలో జనవరి 26న జరగనున్న 76వ భారత గణతంత్ర దినోత్సవ పరేడ్‌కు ఆంధ్ర రాష్ట్రం తరపున మునగపాకకు చెందిన విద్యార్థిని పొలిమేర దివ్యశ్రీ ఎంపికైంది. రాష్ట్రంలో వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన జాతీయ సేవా పథకం నుండి ఎంపికైన విద్యార్థినుల్లో దివ్యశ్రీ మహారాష్ట్రలో ఈ ఏడాది నవంబర్ 12 నుంచి 21 వరకు జరిగిన పూర్వ గణతంత్ర శిబిరానికి ఏపీ నుంచి 44 మంది విద్యార్థులు పాల్గొనగా వీరిలో ప్రతిభ కనబరిచిన పదిమంది విద్యార్థులలో ఒకరిగా దివ్యశ్రీ ఎంపికైంది. ప్రకాశం జిల్లా మల్కాపురం సెయింట్‌ఆన్స్ డిగ్రీ కళాశాలలో చదువుతున్న దివ్యశ్రీ అక్కడ జరిగిన పరేడ్, పరుగు, క్రీడలు వంటి అంశాలలో చురుగ్గా పాల్గొంది. దివ్యశ్రీ ఈ నెల 30న ఢిల్లీకి చేరుకొని ముందస్తు శిక్షణ పొంది జనవరి 26న జరిగే గణతంత్ర వేడుకల్లో పాల్గొనుంది. దివ్యశ్రీ తండ్రి పొలిమేర రాము విశ్రాంత సైనికోద్యోగి కాగా అనకాపల్లిలో నివసిస్తున్నారు.

4 రోజుల పాటు వర్షాలు

అనకాపల్లి: రాగల నాలుగు రోజులు వర్షం కురిసే అవకాశం ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరీ మంగళవారం చెప్పారు. ఈనెల 25న 30 మి.మీ, 26న 20 మి.మీ, 27న 1 మి.మీ, చొప్పున వర్షపాతం నమోదవుతుందన్నారు. గరిష్ట ఉష్ణోగ్రతలు 244 నుంచి 27.4 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు ఈనెల 25న 23, 26న 23.8, 27న 23.1, 28న 22.4,29న 22 డిగ్రీలు నమోదు అవుతుందని, గాలి గంటలకు 6 నుంచి 8 కి.మీటర్లు వీస్తుందని ఆమె చెప్పారు.

ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

- జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్
- బేతపూడి కేజీబీవీ ఆకస్మిక తనిఖీ



బేతపూడి కేజీబివిలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

దేవరాపల్లి: ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకొని, ప్రణాళికా బద్ధంగా చదివి లక్ష్య సాధనకు కృషి చేయాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. మండలంలోని రైవాడ పంచాయితీ బేతపూడిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ మంగళవారం ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదిలో విద్యార్థినులతో మాట్లాడారు. వంటశాలను పరిశీలించి, మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనం అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను ఆరా తీశారు. విద్యార్థులతో కలిసి కలెక్టర్ నేలపై కూర్చొని భోజనం చేసి వారితో ముచ్చటించారు. వంటలు రుచికరంగా ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక విద్యార్థినులు యోగా, క్రీడల్లో రాణిస్తున్నట్లు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో జనవరి 26న జిల్లాలో జరిగే రిపబ్లిక్‌డే వేడుకల్లో ప్రదర్శనకు విద్యార్థినులను తీసుకురావాలని విద్యాశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

వాలాబులో అభివృద్ధి పనుల పరిశీలన

వాలాబు పంచాయతీలో కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే బండారు పర్యటించి రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. బుచ్చెంపాలెం, ఇప్పగరువు, కోడాపల్లి గ్రామాల గిరిజనులు కలెక్టర్‌కు గిరిజన సాంప్రదాయాలతో స్వాగతం పలికారు. తమ పంచాయితీ పరిధిలో కుళాయిల నుంచి బురదనీరు రావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, స్థానిక గిరిజనులు కలెక్టర్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఆమె ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ కె.చంద్రశేఖర్‌ను తక్షణమే సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. కోడాపల్లి, చింతలపాలెం మీదుగా గరిశింగి సచివాలయానికి వెళ్లేందుకు రోడ్డు, దేవరాపల్లి నుంచి వాలాబు వెళ్లే రోడ్డు నిర్మించాలని స్థానికులు కోరారు. అనకాపల్లి ఆర్డీవో ఎస్‌కె. అయిషా, డీఈవో అప్పారావు నాయుడు, జీసీడీవో పద్మ, డీఎల్‌డీవో మంజులవాణి, డ్వామా పీడీ పూర్ణిమాదేవి, ఎంపీపీ బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ సత్యం, వైస్ ఎంపీపీ గంగాభవానీ, రైవాడ సర్పంచ్ చల్లా లక్ష్మి, వాలాబు సర్పంచ్ పోడెల వెంకటలక్ష్మి, తహసీల్దార్ లక్ష్మీదేవి, ఇంచార్జ్ ఈవోపీఆర్డి కామేశ్వరరావు, ఏవో లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు పెంచి సంపద సృష్టిస్తున్నారా?

- 27న విద్యుత్ చార్జీల పెంపుపై 'వైఎస్సార్‌సీపీ పోరుబాట'
- పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎంపీ విజయసాయిరెడ్డి



'వైఎస్సార్‌సీపీ పోరుబాట' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డి, మాజీ మంత్రులు అమర్‌నాథ్, ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే మత్స్యలింగం, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, పండుల రవీంద్ర, కుంబా రవిబాబు, మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్, కంబాల జోగులు

సాక్షి, విశాఖపట్నం: కూటమి ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులపై రూ.15 వేల కోట్ల భారం మోపడాన్ని నిరసిస్తూ ఈనెల 27న తలపెట్టిన 'వైఎస్సార్ సీపీ పోరుబాట' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మద్దిలపాలెంలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో 'వైఎస్సార్ సీపీ పోరుబాట' పోస్టర్‌ను పార్టీ నేతలతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం విశాఖ జిల్లా ముఖ్యనేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27న ముందుగా ప్రతీ నియోజకవర్గంలో సంబంధిత విద్యుత్ కార్యాలయాల అధికారులకు, తరువాత అంతా కలిసి జిల్లా విద్యుత్ కార్యాలయ అధికారులకు వినతి పత్రం అందజేయనున్నట్లు తెలిపారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చంద్రబాబు విద్యుత్ చార్జీలు పెంచనని చెప్పి అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే వినియోగదారులపై సర్దుబాటు చార్జీల పేరిట రూ.15 వేల కోట్లు భారం మోపుతున్నారని మండిపడ్డారు. సంపద సృష్టి అంటే పేదల భారం వేయడమా అని ప్రశ్నించారు. నాణ్యమైన విద్యుత్, విద్య, వైద్యాన్ని అందిస్తామని చెప్పి మద్యాన్ని ఏరులా పారిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, ఎమ్మెల్సీలు కుంబా రవిబాబు, పండుల రవీంద్రబాబు, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, వాసుపల్లి గణేష్‌కుమార్, కంబాల జోగులు, మళ్ల విజయప్రసాద్, అన్నంరెడ్డి అదీప్‌రాజు, తిప్పల నాగిరెడ్డి, తైనాల విజయ్‌కుమార్, తిప్పల గురుమూర్తి రెడ్డి, చింతలపూడి వెంకటరామయ్య, చెంగల వెంకటరావు, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కటుమూరి సతీష్, ముఖ్యనేతలు శోభ హైమావతి, బొడ్డేటి ప్రసాద్, రవిరెడ్డి, సూర్యనారాయణరాజు, బాణాల శ్రీనివాసరావు, పిల్లా సుజాత, బి.పద్మావతి, పేడాడ రమణకుమారి,చినతల్లి పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

పార్టీ కార్యాలయంలో జిల్లా ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షుడు బోని శివరామకృష్ణ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి కేక్ కట్ చేశారు.

ఆన్‌లైన్ వినియోగదారుల హక్కులకూ రక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ జాహ్నవి

అనకాపల్లి : వినియోగదారుల చట్టం 2019 పరిధిలోకి ఆన్‌లైన్ వినియోగదారులు కూడా వస్తారని జేసీ ఎం.జాహ్నవి అన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సం సందర్భంగా మంగళవారం రోటరీ క్లబ్ సమావేశం హాలులో 'వినియోగదారుల రక్షణ చట్టం'పై జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ-కామర్స్, ఈ-చెల్లింపులపై అవగాహన పెంపొందించుకోవాలని, అనైతిక వ్యాపార ధోరణులు, తప్పుదోవ పట్టించే ప్రకటనల పట్ల వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని ఆమె కోరారు. నష్టపోయిన వినియోగదారులు ప్రశ్నించే తత్వాన్ని పెంచుకోవాలన్నారు. బాధిత వినియోగదారులు ఎక్కడ ఉంటే ఆ ప్రాంతంలోని వినియోగదారుల కమిషన్‌ను సంప్రదించి ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. నాణ్యత సేవల్లోని లోపాలు, అక్రమ వ్యాపారాలపై కూడా కమిషన్‌ను సంప్రదించవచ్చని, బాధితులు నేరుగా లేకుంటే వారి ప్రతినిధుల ద్వారా కూడా ఫిర్యాదు చేసే వెసులుబాటు వినియోగదారుల రక్షణ చట్టంలో ఉందని అన్నారు. కొనుగోలు చేసిన వస్తువులకు బిల్లు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. అలాగే వినియోగదారులు నేషనల్ కన్సూమర్ హెల్ప్‌లైన్ నంబర్ 1915, ఏపీ ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ నంబర్ 1967లను సంప్రదించవచ్చని సూచించారు. వినియోగదారుల కమిషన్ల అధ్యక్షురాలు జి.తనూజరెడ్డి, జి.వెంకటేశ్వరి మాట్లాడుతూ వస్తు నాణ్యత, భద్రతల బాధ్యత తయారీ, ఉత్పత్తి, విక్రయదారులపై విధిగా ఉంటుందన్నారు. నగదు చెల్లించి వస్తు సేవల్లో నష్టపోయిన వినియోగదారులకు వినియోగదారుల హక్కుల కమిషన్లు అండగా నిలుస్తాయన్నారు. జిల్లా పౌరసరఫరాల అధికారి (డీసీఎస్ఓ) కనకమేడల వి.ఎల్.నరసింహమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఔషధ నియంత్రణ, పరిపాలన అసిస్టెంట్ డైరెక్టర్ కె.విజయకుమార్, ఎఫ్ఎస్ఎస్ఏఐ గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కె.సతీష్‌కుమార్, జిల్లా లీగల్ మెట్రాలజీ పరిశీలకులు డి.భాస్కరరావు, కన్సూమర్ ఆర్గనైజేషన్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాంగ్రేగుల వెంకటరమణ, వినియోగదారుల సంఘాల ప్రతినిధులు బి.త్రినాథరాజు, సంజీవరావు పాల్గొన్నారు.

ఆరు మండలాల్లో ఇసుక పాయింట్లు

తుమ్మపాల: జిల్లాలో రానున్న నాలుగు రోజుల్లో ఆరు మండలాల్లో ఇసుక నిల్వ కేంద్రాలను ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. ఇసుక కావాల్సిన వినియోగదారులు rand.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకు ని, రసీదు, ఆధార్ కార్డుతో ఇసుక నిల్వ కేంద్రం వద్దకు వెళ్ళి రుసుమును డిజిటల్ పేమెంట్ రూపంలో చెల్లించి ఇసుక పొందగలరన్నారు.

ఇసుక నిల్వ పాయింట్‌ల వివరాలిలా..

ప్రదేశం	ఏజెన్సీ పేరు	ఫోన్ నెం.	టన్ను ఇసుక ధర (రూ.)
అనకాపల్లి	గోదావరి, కృష్ణ ట్రాన్స్‌పోర్ట్	9000227755 984333867	1000
నర్సీపట్నం	మైత్రి ఇన్‌ఫ్రా	6301300232 9390580460	900
చోడవరం	డిటో	8328057859 8500001858	1100
మాడుగుల	డిటో	9949372466 9391351581	1100
నక్కపల్లి	బివిఆర్ ఇన్‌ఫ్రా	9966391148 8008674407	800
అచ్చుతాపురం	నన్నపనేని ఎర్త్ మూవర్స్	9492939276 8978616271	1000

శారదా తీరాన.. బృందావనం

అనకాపల్లి ప్రాంత అభివృద్ధి కోసం **గత** వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేసిం**ది.** గ్రామీణ, పట్టణ ప్రాంతాల మిళిత**మైన** అనకాపల్లి కేంద్రంగా కొత్త జిల్లాకు **అప్పటి** ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహ**న్‌రెడ్డి కృషి** చేశారు. అటవీశాఖ ఆధ్వర్యంలో **పర్యాటకు**లను ఆకర్షించే విశాఖలో ఉన్న కం**బాల**కొండ వన్య సంరక్షణ అటవీ పార్కు తరహాలో కశింకోట మండలం బ**య్యవరం** వద్ద ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. నాటి ముందుచూపు ..నేడు శారదా**వనం** రూపుదిద్దడానికి బాటలు వేసింది.

- గత ప్రభుత్వ హయాంలో అటవీపార్కు ఏర్పాటుకు శ్రీకారం
- కశింకోట శారదానది ఒడ్డున 650 ఎకరాల్లో 'శారదావనం'
- సందర్శకులకు ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతున్న అటవీశాఖ
- తొలి దశలో 120 ఎకరాల్లో రూ.1.4 కోట్లతో అభివృద్ధి
- ఔషధ మొక్కలు, పగోడాలు, ఫోటో షూట్ డేక్ ఏర్పాటు
- ఎర్రచందనం, టేకు, వెదురు మొక్కల పెంపకం



శారదావనం అటవీ పార్కు

సాక్షి, అనకాపల్లి: తూర్పు కనుమల్లో ఉన్న అనంతగిరి కొండల్లో ప్రారంభమై శారదానది..రెండు జిల్లాల్లో సుమారుగా 130 కిలోమీటర్లు ప్రవహించి అనకాపల్లి జిల్లాలో బంగారమ్మపాలెం గ్రామం వద్ద బంగాళాఖాతంలో కలుస్తుంది. ఆహ్లాదకరమైన శారదానది ఒడ్డున ప్రసిద్ధ బొజ్జన్నకొండ, లింగలకొండ బౌద్ధ గుహ అవశేషాలు, గోకివాడ అటవీ ప్రవేశ ద్వారం సమీపంలో కొట్టూరు ధనాదిబ్బలు వంటివి ఆహ్లాదకరంగా కనిపిస్తాయి. శారదానది ఒడ్డున కశింకోట బయ్యవరం వద్ద జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న సుమారు 650 ఎకరాల రిజర్వ్ ఫారెస్ట్‌లో 'శారదావనం' అటవీ పార్కు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. నాడు మొదలైన తొలి దశలో 25 ఎకరాల్లో 'శారదావనం' అటవీ పార్కు పనులు దాదాపు పూర్తయ్యాయి. తొలి, తుది దశల్లో మొత్తం 120 ఎకరాల్లో శారదావనం పార్కును అభివృద్ధి చేసేందుకు గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రశాంతమైన వాతావరణం, జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఈ పార్కు పచ్చటి ప్రకృతి ప్రశాంత వాతావరణంతో పర్యాటకులను విశేషంగా ఆకర్షించేలా ఏర్పాటు చేస్తున్నారు. సందర్శకుల మనసు దోచేలా శారదా వనాన్నితీర్చిదిద్దుతున్నారు.





పార్కులో మొక్కలు పెంపకం

రెండు దశల్లో రూ.2 కోట్లతో అభివృద్ధి

బయ్యవరం వద్ద గల రిజర్వు ఫారెస్టులో **అటవీ శాఖ** ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శారదావనం పనులు దాదాపు పూర్తి కావస్తున్నాయి. రూ.2 కోట్లతో శారదావనం అటవీ పార్కు నిర్మాణం చేపడుతున్నారు. తొలి దశలో రూ.1.40 కోట్లు, రెండో దశలో రూ.60 లక్షలతో పనులు చేపట్టనున్నారు. జిల్లా ప్రధాన కేంద్రం అనకాపల్లి మీదుగా ప్రవహిస్తున్న శారదా నది ప్రాశస్త్యాన్ని దృష్టిలో పెట్టుకొని నది పేరు పెట్టి వనాన్ని అభివృద్ధి చేస్తున్నారు. శారదావనంలో ప్రకృతి సౌందర్యం సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటుంది.

కాశ్మీర్ దేవదారు కలపతో...

శారదావనంలో గల నిర్మాణాలను 'కాశ్మీర్ దేవదారు ఉడ్'తో ఏర్పాటు చేశారు. రోజ్ వుడ్, ఎర్ర చందనం, టేకు, వెదురు తదితర జాతుల మొక్కలు, గడ్డి పెంపకం, ఔషధ మొక్కల పెంపకం చేపడుతున్నారు. అడవుల ప్రాముఖ్యతను ప్రజలకు, విద్యార్థులకు తెలియజేయడానికి దీని నిర్మాణం కాశ్మీర్ దేవదారు ఉడ్‌తో చేపడుతున్నారు. దీన్ని విస్తరించి భవిష్యత్తులో పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయనున్నారు. సందర్శకులు వేచి ఉండడానికి పగోడాలు, అడవులు, చెట్ల ప్రాముఖ్యతను వివరించే ఎడ్యుకేషన్ సెంటర్, తినుబండారాల కోసం క్యాంటీన్ సదుపాయం ఏర్పాటు చేశారు. వనంలో అందమైన లోకేషన్లలో ఫొటోలు తీసుకునేందుకు వీలుగా డెక్ ఏర్పాటు చేస్తున్నారు.

త్వరలో జంతు ప్రదర్శన శాల

సందర్శకులను అలరించే విధంగా త్వరలో జంతు ప్రదర్శన శాలను కూడా ఏర్పాటు చేయను**న్నారు.** నామమాత్రపు రుసుంతో **ప్రజలు**, విద్యార్థులకు ప్రవేశాలు **క**ల్పించనున్నారు. అటవీ వాతావరణం ప్రతిబింబించే విధంగా వనంలో నిర్మాణాలుంటాయి. మిగిలి ఉన్న పనులను సత్వరమే పూర్తి చేసేలా కృషి చేస్తున్నారు.



శారదానదిలో క్యాంటీన్ షెడ్

మార్చి నాటికి పూర్తి..

శారదావనం అటవీ పార్కు నిర్మాణ పనులు గతేడాది మార్చి నెలలో ప్రారంభమయ్యాయి. ఇప్పటికి 80 శాతం పూర్తయ్యాయి. వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి కానుంది. రెండు దశల్లో నిర్మాణ పనులు పూర్తకానున్నాయి. పర్యాటకులను ఆకర్షించే విధంగా వినూత్నంగా కాశ్మీర్ దేవదారు ఉడ్‌తో లోపల నిర్మాణాలు చేపడుతున్నాం.

-కాళిదాస్, ఫారెస్ట్ కన్జర్వేటర్, అనకాపల్లి

నర్సీపట్నం టు విశాఖ గంజాయ్



- గంజాయి వలలో చిన్న పిల్లలు సైతం..
- గంజాయి తాగొద్దని చెప్పిన వృద్ధుడిని చితకబాదారు
- కేసుల నుంచి తప్పించమని కొంతమంది నా వద్దకు వస్తున్నారు..
- వాళ్లకి ఎట్టి పరిస్థితుల్లోనూ సహకరించేది లేదు
- గంజాయి రవాణాపై స్పీకర్ అయ్యన్న సంచలన వ్యాఖ్యలు

సాక్షి, అనకాపల్లి: 'నర్సీపట్నం నుంచి విశాఖ రూట్‌లో గంజాయి రవాణా విపరీతంగా జరుగుతుంది..12 ఏళ్లు, 14 ఏళ్ల పిల్లలు నర్సీపట్నం సమీపంలో కాలువ మదుముల వద్ద కుర్చొని గంజాయి తాగుతున్నారు. ఇటీవల 65 ఏళ్ల పెద్దాయన ఆ మార్గంలో పోతూ చూసి గంజాయి తాగొద్దన్నందుకు ఆ పెద్దాయననే నర్సీపట్నంలో చితకబాదారు. గంజాయి కేసుల్లో ఇరుక్కున్న వారు నా వద్దకు కేసు లేకుండా చేయమని కోరుతూ మా పార్టీ నాయకులే తీసుకొస్తున్నారు. అయినా తాను అలాంటి వాటిని సహకరించడం లేదు. గంజాయిని రాష్ట్రంలో రూపుమాపకపోతే మీ పిల్లల భవిష్యత్తు మీకు తెలియకుండానే నాశనం అవుతుంది..' అంటూ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో గంజాయి పరిస్థితిని కళ్లకు కట్టినట్టు సంచలన వ్యాఖ్యలు చేశారు. కశింకోటలో నూకాంబిక ఫంక్షన్‌హాలు వద్ద అభివృద్ధి నిర్మాణ పనులు శంకుస్థాపన కార్యక్రమంలో బహిరంగ వేదికపై మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలలు పూర్తయ్యాయి. అయినా గంజాయిని అరికట్టడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందినట్టు నేరుగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాటల్లోనే స్పష్టంగా తెలుస్తోంది.

అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గంజాయి రవాణా ఎక్కువగా జరుగుతుందని ఎన్నికలకు ముందు చంద్రబాబు ఊకదంపుడు ఉపన్యాసాలు చేశారు. అధికారం వచ్చి ఆరు నెలలైనా గంజాయిని అరికట్టడం కాదు కదా గంజాయి సేవించేవారే ఎక్కువైనట్టు స్పీకర్ మాటల్లోనే తెలుస్తోంది. హోంమంత్రి వంగలపూడి అనిత సొంత జిల్లాలో గంజాయి అక్రమ రవాణా ఎక్కువగా జరగడం వంటి ఘటనలు చూస్తే పోలీసులు, హోం మంత్రి అనిత పూర్తిగా వైఫల్యం చెందినట్టుగానే రాజకీయ విమర్శకులు సైతం చర్చించుకుంటున్నారు.

అంతేకాకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అధికారం అనుభవించి..ఇప్పుడు టీడీపీ, జనసేన, బీజేపీలో చేరే నేతలను చేర్చుకోవద్దంటూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడి 48 గంటలు కాకుండానే విశాఖలో వైఎస్సార్‌సీపీలో ఉన్న కీలక నేత బీజేపీలోకి చేరుతున్నట్టు ప్రకటించారు. అంటే కూటమి పార్టీల్లో అయ్యన్న మాట చెల్లనట్టేనా?అని రాజకీయ విమర్శకులు సైతం చర్చించుకుంటున్నారు.

కరెంట్ చార్జీల పెంపుపై పోరుబాట



పార్టీ నాయకులతో కలిసి పోరుబాట పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

- 27న చార్జీల పెంపుపై నిరసన
- మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: కూటమి ప్రభుత్వం కరెంట్ చార్జీల బాదుడుపై వైఎస్సార్‌సీపీ పోరుబాటకు పిలుపు న్‌ిచ్చిందని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పేర్కొన్నారు. పెంచిన చార్జీలు తగ్గించాలనే డిమాండ్‌తో ఈ నెల 27న నియోజకవర్గ కేంద్రమైన నర్సీపట్నంలో నిరసనతో పాటు విద్యుత్ అధికారులకు వినతిపత్రాలు అందజేస్తున్నట్లు తెలిపారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి కరెంట్ చార్జీల బాదుడుపై వైఎస్సార్‌సీపీ పోరుబాట పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు ఒక్క పైసా కూడా చార్జీలు పెంచబోమని చెప్పి ఇప్పుడు ఎడాపెడా విద్యుత్ చార్జీలు పెంచడం దారుణమన్నారు. అధికారంలోకి వచ్చిన ఆర్నెళ్లలోనే రెండుసార్లు ప్రజలపై భారం మోపి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. జగనన్న హయాంలో విద్యుత్ చార్జీలు యూనిట్ రూ.2.90 పైసలు ఉంటే ప్రస్తుతం రూ.4.80 పైసలు చంద్రబాబు పెంచారన్నారు. నూతన సంవత్సర కానుకగా విద్యుత్ చార్జీల రూపంలో ప్రజలపై రూ.15 వేల కోట్లు భారం మోపారన్నారు. ఎస్సీ, ఎస్టీల విద్యుత్ రాయితీని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు ప్రజలకు లేనిపోని ఆశలు కల్పించి అధికారంలోకి వచ్చాక చుక్కలు చూపిస్తున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, రైతులు, మహిళలు ఇలా అన్ని వర్గాల ప్రజలను కూటమి ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ఎండగడతామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు చింతకాయల సన్యాసిపాత్రుడు, రుత్తల యర్రాపాత్రుడు, ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ప్రణాళికా బద్ధంగా పరీక్షలకు సన్నద్ధం కావాలి

డీఈవో అప్పారావునాయుడు



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో అప్పారావునాయుడు

చీడికాడ : టెన్త్, ఇంటర్ విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా పరీక్షలకు సన్నద్ధం కావాలని డీఈవో అప్పారావునాయుడు సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని మంచాల మోడల్ స్కూల్‌ను సందర్శించారు. ఆయన పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. అనంతరం అటల్ టింకరింగ్ ల్యాబ్ సందర్శించి విద్యార్థులు తయారు చేసిన రోబోను చూసి తయారీ విధానం, ప్రయోజనాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం టెన్త్, ఇంటర్ విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల అభ్యాసంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంఈఓలు బొంజుబాబు, బి.వి.రమణ, ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి ఉన్నారు.

దొరల భాషలో అదరగొట్టేలా..



చినదొడ్డిగల్లు జడ్పీ పాఠశాలలో గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఐఎఫ్‌పీ ప్యానల్ ద్వారా బోధన చేస్తున్న ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు రమణ



తన సొంత నిధులతో స్టడీ మెటీరియల్ అందజేస్తున్న రమణ మాస్టర్

- ఆంగ్ల భాషపై పట్టు సాధిస్తున్న పల్లె విద్యార్థులు
- చినదొడ్డిగల్లు జెడ్పీ పాఠశాల విద్యార్థుల ఘనత
- బోధనలో రమణ మాస్టారు ప్రత్యేక కృషి

నక్కపల్లి : గతంలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమం అనేది కత్తిమీద సాములాంటిదే. పల్లెల్లో ఆంగ్ల మాధ్యమం అనేది కలగా మిగిలేది. ఇంగ్లిష్ మీడియంలో చదవాలంటే పట్టణాల్లో ఉన్న కార్పొరేట్ పాఠశాలలకు వెళ్లి వేల రూపాయల ఫీజులు కట్టి చదువుకోవాల్సిన దుస్థితి ఉండేది. గ్రామాల్లో ఎన్ని ఎక్కువ మార్కులు తెచ్చుకున్నా ఎంతమంచి ర్యాంకులు వచ్చినా తెలుగు మీడియం విద్యార్థులు మాత్రం బయటప్రపంచంతో పోటీ పడడానికి భయపడాల్సిన పరిస్థితి ఉండేది. బయట ఇంగ్లిష్‌లో మాట్లాడాలంటే వణికిపోయేవారు. భాషపై సరైన పట్టులేక మనోవేదన చెందేవారు. ఇటువంటి పేద, గ్రామీణ ప్రాంత విద్యార్థుల దీన స్థితిని చూసి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లో పూర్వ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రాథమిక స్థాయి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమాన్ని అమల్లోకి తెచ్చారు. పల్లెల్లో చదువుకున్న పేద విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమాన్ని చేరువ చేసి వారు ఇంగ్లీషులో మాట్లాడడం, పరీక్షలు రాయడం, ఇంటర్వ్యూలను ఎదుర్కొనేలా చేయడానికి చర్యలు చేపట్టారు. ఒకటో తరగతినుంచే ఆంగ్ల మాధ్యమంలో బోధిస్తే విద్యార్థులు ఎటువంటి పోటీ పరీక్షలనైనా సులభంగా ఎదుర్కొగలరన్న ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం ఆంగ్ల మాధ్యమం ప్రారంభించింది. ప్రభుత్వ **ఆశయాలకు అనుగుణంగానే** పలు పాఠశాలల్లో **చదువుతున్న విద్యార్థులు** ఆంగ్ల భాషపై మంచి **పట్టు సాధిస్తున్నారు. ఇందు**కోసం విద్యార్థులకు తోడ్పాటు అందించడానికి చినదొడ్డిగల్లుకు ఏడిద వెంకటరమణ నడుం బిగించారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు వెంకటరమణ రవీంద్రనాథ్ ఠాగూర్ ఇంగ్లిష్ క్లబ్‌ను తన సొంత ఖర్చుతో ప్రారంభించారు. ఆంగ్లబాషపై ఆసక్తి ఉన్న పలువురు విద్యార్థులను మెరికల్లా తయారు చేస్తున్నారు. గతంలో తాను పనిచేసిన డీఎల్‌పురం, గునిపూడి, బంగారయ్యపేట, నెల్లిపూడి, అమలాపురం పాఠశాలల్లో కూడా ఇంగ్లిష్‌పై మక్కువ చూపించే విద్యార్థులకు మంచి శిక్షణ ఇచ్చి మెలకువలు నేర్పించారు. తెలుగు మీడియం చదివే సుమారు 300 మంది విద్యార్థులకు ఇంగ్లిష్‌లో రాయడం, చదవడం నేర్పించారు. ప్రస్తుతం చినదొడ్డిగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూనే పిల్లలకు తాను స్థాపించిన రవీంద్రనాథ్ ఠాగూర్ ఇంగ్లిష్ క్లబ్ ద్వారా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఇంగ్లిష్ సబ్జెక్ట్‌పై ఉత్సాహం కనబర్చేందుకు ఆయన వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్‌లు, స్కిట్‌లు తదితర పోటీలు నిర్వహిస్తుంటారు. విజేతలకు తన సొంత నిధులతో బహుమతులు ప్రదానం చేస్తున్నారు. గత ప్రభుత్వం పాఠశాలలకు సరఫరా చేసిన ఐఎఫ్‌పి ((ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్) వినియోగించి విద్యార్థులకు బోధన చేస్తుంటారు. పాఠశాలల్లో వివిధ తరగతులు చదువుతున్న సుమారు 150 మంది పిల్లలకు ఏడో తరగతి నుంచి పదో తరగతి వరకు ఆంగ్ల భాషలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ప్రతినెలా స్పెల్‌బీ, డిబెట్‌లు, గ్రూపు డిస్కషన్స్ పెట్టి విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. ఆంగ్లభాష అంటే ఆమడ దూరం ఉండే గ్రామీణ విద్యార్థులు రమణ మాస్టారు వద్ద ఇంగ్లిషు నేర్చుకోవడానికి ఉవ్విళ్లూరుతున్నారు. వేసవి సెలవుల్లోను, సాధారణ సెలవు దినాల్లో గ్రంథాలయాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిషుపై శిక్షణ ఇస్తున్నారు.

ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాను



ఇంగ్లిస్ అంటే పిల్లల్లో ముందు భయం పొగొట్టాలి. ఇంగ్లిష్‌లో మాట్లాడాలంటే తప్పుగా చెబుతున్నామనే సంశయించేవారు ఉన్నారు. ఇటువంటి వారిలో ఇంగ్లిష్‌పై భయం పోవడానికి రవీంద్రనాథ్ ఠాగూర్ ఇంగ్లిష్ క్లబ్ స్థాపించి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాను. ఇప్పుడు పిల్లలు ఎక్కడకు వెళ్లినా భయపడకుండా ఇంగ్లిష్‌లో మాట్లాడుకుంటున్నారు.

– ఏడిద వెంకటరమణ, ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు, చినదొడ్డిగల్లు

ఇంగ్లిష్ అంటే భయం పోయింది



ఒకప్పుడు ఇంగ్లిష్ పీరియడ్ అంటే భయంగా ఉండేది. ఇప్పుడా పరిస్థితి లేదు. రమణ మాస్టారు వద్ద శిక్షణ వల్ల మంచి పట్టు సాధించాను. గతంలో ఏదో బట్టీ పట్టి చదివేసి పరీక్షల్లో ప్రశ్నలకు సమాధానాలు రాయడానికే పరిమితం మయ్యేవాళ్లం. రమణ మాస్టారు ప్రత్యేక బోధన వల్ల ఇంగ్లిష్‌లో కూడా మాట్లాడుకోగలుగుతున్నాం.

– రాజేష్, తొమ్మిదో తరగతి విద్యార్థి

సులభంగా నేర్చుకోవచ్చు



శిక్షణ తీసుకుంటే ఏ భయం ఉండదు. ఇంగ్లిష్ నేర్చుకోవడం పెద్ద కష్టమైన పనికాదు. ఏదో తెలియని భయం వల్ల ఇంతకాలం దూరంగా ఉండేవాళ్లం. ఇప్పుడు రమణ మాస్టారు ఏర్పాటు చేసిన ఇంగ్లిషు క్లబ్‌లో ప్రతిరోజు కొద్ది సమయం కేటాయించి ఇంగ్లిష్ నేర్చుకోవడం వల్ల పరీక్షలు సులభంగా రాయగలగడమే కాకుండా మాట్లాడడం, రాయడం, సమాధానాలు చెప్పడం కూడా నేర్చుకున్నాం. ఇప్పుడు ఇంగ్లిష్ అంటే భయం పోయింది. ఇష్టం పెరిగింది.

– రేష్మాంబిక, ఏడో తరగతి విద్యార్థి

పలు రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం: నిర్వహణ పనుల నిమిత్తం పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈ నెల 26 నుంచి మార్చి 1వ తేదీ వరకు విశాఖపట్నం-రాజమండ్రి, 26 నుంచి మార్చి 1వ తేదీ వరకు విజయనగరం-విశాఖ మెము స్పెషల్, 27 నుంచి మార్చి 1వ తేదీ వరకు విశాఖపట్నం-పలాస-విశాఖపట్నం మెము స్పెషల్ , 29న రూర్కెలా-జగదల్‌పూర్-రూర్కెలా ఎక్స్‌ప్రెస్, ఈ నెల 30వ తేదీన బనారస్-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్‌లు రద్దయ్యాయి.

క్రషింగ్‌లోగా బకాయిలు చెల్లించండి



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం నాయకుడు రెడ్డిపల్లి

చోడవరం రూరల్: చెరకు రైతులు, కార్మికులకు చోడవరం సుగర్స్ ఈ సీజన్ క్రషింగ్‌ను చేపట్టడానికి ముందు గత సీజన్‌కు సంబంధించిన బకాయిలు చెల్లించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. చోడవరం సుగర్స్ గత సీజన్‌కు సంబంధించి రైతులు, కార్మికులకు సుమారు 15 కోట్ల రూపాయల బకాయి పడినట్టు తెలిపారు. ఈ బకాయిలను సుగర్స్ యాజమాన్యం తక్షణం చెల్లించాలని కోరారు. ఎన్నికలకు ముందు గత ప్రభుత్వం కంటే అధికంగా చెరకు మద్దతు ధర చెల్లిస్తామంటూ కూటమి నాయకులైన ఇద్దరు రాజులు కెఎస్ఎన్ఎస్, పి.వి.ఎస్.ఎన్ రాజులు అధికారంలోకి వచ్చాక మాట మార్చి కాలం వెళ్లదీస్తున్నారని దుయ్యబట్టారు. కూటమి నేతలు అధికారానికి రాకముందు ఒకమాట, వచ్చాక మరో మాట ఆడుతూ రైతు, కార్మిక లోకాన్ని మోసం చేస్తున్నారని విమర్శించారు. మొలాసిస్, కో-జనరేషన్ ద్వారా 9 కోట్ల రూపాయల ఆదాయం ఉన్నప్పటికీ రైతులు, కార్మికుల బకాయిల చెల్లింపుల పట్ల యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తున్నట్టు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో క్రషింగ్‌కు ముందుగానే ఎటువంటి బకాయిలు లేకుండా సుమారు 89 కోట్ల 90 లక్షల రూపాయల నిధులు విడుదల చేసిన సంగతిని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. చనిపోయిన రైతుల కుటుంబాలకు ఎటువంటి పరిహారం అందివ్వడం లేదని , కూటమి నేతలు తక్షణం తమ అధికార పలుకుబడిని వినియోగించి ఫ్యాక్టరీని, రైతు, కార్మికులను ఆదుకోవాలని రెడ్డిపల్లి కోరారు. ఆయనతోపాటు చెరకు రైతు, అనుబంధ రైతు సంఘాల ప్రతనిధులు హాజరయ్యారు.

పరిశ్రమ బస్సు ఢీకొని ఉద్యోగి దుర్మరణం

- కోనెంపాలెం వద్ద ఘటన
- మృతుడు వైఎస్సార్‌సీపీ కార్యకర్త



లోవరాజు (ఫైల్)

రాంబిల్లి(యలమంచిలి)/అచ్యుతాపురం: తను పనిచేస్తున్న పరిశ్రమకు చెందిన బస్సు ఢీకొట్టిన ప్రమాదంలో ఓ ప్రైవేటు ఉద్యోగి దుర్మరణం చెందాడు. ఈ ఘటన కోనెంపాలెం వద్ద మంగళవారం చోటు చేసుకుంది. అచ్యుతాపురం సీఐ నమ్మి గణేష్, స్థానికులు, మృతుని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. రాంబిల్లి మండలం హరిపురం గ్రామానికి చెందిన ధూళి లోవరాజు(35) కొన్ని సంవత్సరాలుగా అచ్యుతాపురం ఎస్ఈజెడ్ అధిస్తాన్ పరిశ్రమ యూనిట్ -3లో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం అతడు ఏ షిఫ్ట్ విధులకు బయలుదేరగా, కంపెనీ బస్సు వెళ్లిపోవడంతో తన ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. తిరిగి మధ్యాహ్నం 2 గంటలకు విధులు ముగించుకుని తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా అచ్యుతాపురం సమీపంలో కోనెంపాలెం వద్దకు వచ్చేసరికి తన ముందు మహిళా కార్మికులను తరలిస్తున్న కంపెనీ బస్సు ఆకస్మికంగా ఆపడంతో లోవరాజు ఢీకొట్టి రోడ్డుపై పడిపోయాడు. అంతలో అచ్యుతాపురం వైపుగా వస్తున్న అదే కంపెనీకి చెందిన మరో బస్సు అతడిపై దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడటంతో స్థానికులు, బంధువులు అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించగా మార్గమధ్యలో ప్రాణాలు కోల్పోయాడు. మృతుడికి భార్య, ఇద్దరు చిన్నారులు, తండ్రి రామకృష్ణ, జయమ్మ ఉన్నారు. అచ్యుతాపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హరిపురంలో విషాదం : ధూళి లోవరాజు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం హరిపురం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తగా చురుగ్గా ఉండేవాడు. పార్టీపరంగా ఏ కార్యక్రమం జరిగినా అందరితో కలివిడిగా ఉండేవాడు. లోవరాజు ఇంటి పెద్ద కొడుకు కాగా, తమ్ముడు కూడా ఉన్నాడు.

నాగజ్యోతికి మోస్ట్ పాపులర్ వైశ్య విమెన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న నాగజ్యోతి

రోలుగుంట: కొత్తకోట ఉన్నత పాఠశాల ఉపాధ్యాయిని, వాసవీ క్లబ్ రీజనల్ సెక్రటరీ నాగజ్యోతికి వైశ్య మోస్ట్ పాపులర్ ఉమెన్ టాప్ 20లో స్థానం దక్కింది. సోమవారం రాత్రి హైదరాబాద్ హైటెక్ సిటీలో మానేపల్లి జువెలరీస్, వారహీ సిల్క్స్, ఇమ్మాది ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన మోస్ట్ పాపులర్ వైశ్య విమెన్ అవార్డు ప్రెజెంటేషన్ కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రతిభ చాటారు. ఈ ప్రోగ్రాంలో మానేపల్లి జువెలరీ నిర్వాహకుడు ఇమ్మాది శివకుమార్ నుంచి అవార్డు అందుకున్నారు. గతేడాది నాగజ్యోతికి వైశ్య లైమ్ లైట్ జూరీ అవార్డు వచ్చింది. యూట్యూబ్ సునయన, సింగర్ మంగ్లీ, నైనా నెహ్వాల్, అంబికా కృష్ణ, ఇంపాక్ట్ ఫౌండర్ గంప నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రి ఎదుట విద్యార్థి బంధువుల ఆందోళన

మృతికి కారణమైన అధికారులను శిక్షించాలని డిమాండ్



ఏరియా ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థి బంధువులు, ఎస్ఎఫ్ఐ. డివైఎఫ్ఐ నాయకులు

నర్సీపట్నం: అల్లూరి జిల్లా కొయ్యూరు గురుకుల విద్యార్థి వంతల మనోజ్ మృతిని నిరసిస్తూ మృతుడు బంధువులు, ఎస్ఎఫ్ఐ నాయకులు స్థానిక ఏరియా ఆస్పత్రి ప్రధాన గేటు ముందు బైఠాయించి ఆందోళనకు దిగారు. విద్యార్థి మృతికి కారకులైన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను తక్షణమే అరెస్టు చేయాలని నినాదాలు చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గౌతమ్, డీవైఎఫ్ఐ జిల్లా నాయకుడు రమణ మాట్లాడుతూ పది రోజుల క్రితం పదో తరగతి విద్యార్థి మనోజ్ తేజ అదృశ్యమై ఈ రోజు సమీపంలోని చెరువులో శవమై తేలటం దారుణమన్నారు. గురుకుల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు నిర్లక్ష్యం కారణంగా తల్లిదండ్రులు విద్యార్థిని కోల్పోయారన్నారు. బాధిత కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా, మృతుడు తండ్రికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యార్థి కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఎస్ఎఫ్ఐ పోరాడుతుందన్నారు. డివిజన్ ప్రెసిడెంట్ భూషణ్, వైస్ ప్రెసిడెంట్ భార్గవ్, సీపీఎం నాయకులు చిరంజీవి, డీవైఎఫ్ఐ జిల్లా నాయకుడు తరుణ్ పాల్గొన్నారు.

అపరాధ రుసుంతో 'పది' పరీక్ష ఫీజు

అనకాపల్లి: వచ్చే ఏడాది మార్చిలో పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు(తత్కాల్) అపరాధ రుసుం రూ.వెయ్యితో ఈ నెల 27 నుంచి జనవరి 10వ తేదీ వరకూ హెచ్ఎం లాగిన్‌ల్లో నమోదు చేసుకోవాలని డీఈవో గిడ్డి అప్పారావునాయుడు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికీ ఆన్‌లైన్లో పదో తరగతి పరీక్ష ఫీజులు చెల్లించని విద్యార్థులు తత్కాల్‌లో చెల్లించాలని సూచించారు.

ఇద్దరు మద్యం విక్రేతల అరెస్టు

మునగపాక : మండలంలోని చూచుకొండలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. సమాచారం మేరకు అనకాపల్లి ప్రొహిబిషన్ అలాగే ఎక్సైజ్ శాఖల సంయుక్త నిర్వహణలో మంగళవారం దాడులు చేశారు. ఈ దాడిలో కాంద్రేగుల కళ్లాల వద్ద 10 మద్యం సీసాలతో యలమంచిలి సన్యాసినాయుడు, పెంటకోట కళ్లాల వద్ద 19 మద్యం సీసాలతో బొద్దపు రామకృష్ణ పట్టుబడినట్టు ఎక్సైజ్ అధికారి వైఎల్ నాయుడు తెలిపారు.

స్పీకరు బందోబస్తుకు పాట్లు

నాతవరం: మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో స్పీకరు అయ్యన్నపాత్రుడు పర్యటనకు పోలీసు బందోబస్తుకు అనేక పాట్లు పడ్డారు. మంగళవారం నర్సీపట్నం డీఎస్పీ మోహన్ వర్షంలోనే తడుచుకుంటూ రోడ్డు మార్గంలో స్పీకరు వాహనం వచ్చేందుకు అడ్డుగా ఉన్న బైక్‌లను స్వయంగా తొలగించారు. కొండల మీద ఉన్న ఈ గ్రామంలో మావోయిస్టుల ప్రభావం ఎక్కువగా ఉండేది. గతంలో అనేక సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో డీఎస్పీ పర్యవేక్షణలో రూరల్ సీఐ ఎల్. రేవతమ్మ, నాతవరం ఎస్ఐ సిహెచ్. భీమరాజు ఆధ్వర్యంలో పోలీసు బృందాలు ముమ్మర తనిఖీలు చేసి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశాయి.

ఎంఎల్‌సీసీ కమిటీతో ఆస్తి వివాదాలు పరిష్కారం

- ప్రతి శనివారం మండల స్థాయి సమన్వయ కమిటీ సమావేశం
- ఎ.భీమవరం రెవెన్యూ సదస్సులో కలెక్టర్ విజయ కృష్ణన్



ఎ.భీమవరంలో రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

కె.కోటపాడు: ఆస్తుల పంపకాల్లో కుటుంబ సభ్యుల అంగీకారంతో వివాదాలు పరిష్కరించేందుకు ప్రతీ శనివారం మండల స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. మండలంలో ఎ.భీమవరంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొన్నారు. అర్జీల వివరాలతో పాటు వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను తహసీల్దార్ వి.భాగ్యవతి వివరించగా, దరఖాస్తులకు ఎన్ని రోజుల్లో పరిష్కారం లభించనున్నట్లో వివరించాలని కలెక్టర్‌కు తెలిపారు. అనంతరం సమావేశంలో పాడుగుపాలేనికి చెందిన లెక్కల అప్పలనాయుడు వారసత్వంగా వచ్చిన ఎ.భీమవరంలో భూమిని తన సోదరుడు రాకుండా చేసినట్లు కలెక్టర్‌కు వివరించాడు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నదమ్ముల, అన్నాచెల్లెళ్ల మధ్య వచ్చే ఆస్తుల గొడవల పరిష్కారానికి కోర్టులను ఆశ్రయించి ఎన్నో వ్యయప్రయాసలను పడే పరిస్థితులు ఉంటున్నాయన్నారు. ఇటువంటి సమస్యలను మండల స్థాయిలో ఇరువర్గాల వారి అంగీకారంతో పరిష్కారం చూపేందుకు ప్రతి శనివారం మండల లెవెల్ కోఆర్డినేషన్ కమిటీ(ఎంఎల్‌సీసీ) సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కమిటీలో జిల్లా స్థాయి అధికారి చైర్మన్‌గాను, సభ్యులుగా తహసీల్దార్, ఎంపీడీవో, ఎస్‌హెచ్‌వోలు ఉంటారన్నారు. ఇరువర్గాల వారికి నోటీసులను జారీ ద్వారా సమాచారాన్ని ముందస్తుగా తెలపాలని సూచించారు. కలెక్టర్‌తోపాటు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తిని వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సబ్బవరపు త్రినాథ రామకాసు, పూడి సురేష్, శేషు, గౌరీ శంకర్, సర్పంచ్ త్రా సన్యాసమ్మ జ్ఞాపిక అందించి దుశ్శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ ఆర్.పూర్ణిమాదేవి, ఆర్డీవో ఆయిషా, డిప్యూటీ తహసీల్దార్ డి.రమేష్‌బాబు, మండల సర్వేయర్ రామచంద్రమూర్తి, ఎంపీటీసీ పూడి లక్ష్మి, పూడి నారాయణమూర్తి, టీడీపీ మండలాధ్యక్షుడు రొంగలి మహేష్, త్రా నారాయణరావు పాల్గొన్నారు.

మార్చిలోగా ఆస్పత్రి భవనం పూర్తి కావాలి

- మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



మాడుగులలో స్వయం సహాయక సంఘం తయారు చేస్తున్న హల్వాను రుచి చూస్తున్న కలెక్టర్



ఆస్పత్రిలో వైద్యాధికారి చంద్రశేఖర్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

మాడుగుల రూరల్ : స్థానిక సీహెచ్‌సీలో భవన నిర్మాణాన్ని వచ్చే మార్చిలోగా పూర్తి చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ సంబంధిత కాంట్రాక్టర్‌ను, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రాత్రి ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యాధికారి బి.చంద్రశేఖర్, ఇతర వైద్యులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఇక్కడ సిబ్బంది, వైద్యుల కొరత ఉందని, జనరేటర్ సౌకర్యం కల్పించాలని ప్రధాన వైద్యాధికారి కోరారు. అనంతరం ఆమె ఆస్పత్రిలో కొత్త భవన నిర్మాణాన్ని పరిశీలించారు. కొత్త భవనం పూర్తయ్యాక జనరేటర్ మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. నూతన భవనాన్ని సత్వరం పూర్తి చేయాలని మండల సీపీఎం కార్యదర్శి ఇ. నర్సింహమూర్తి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసారు.

మహిళలు స్వయం ఉపాధితో ముందుకు సాగాలి

మాడుగుల రూరల్: మహిళలు స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం సమీపంలో జయశ్రీ స్వయం సహాయక సంఘ సభ్యులు తయారు చేస్తున్న మాడుగుల హల్వాను ఆమె మంగళవారం సాయంత్రం పరిశీలించారు. సంఘం ఆధ్వర్యంలో తయారు చేసిన హల్వాను ఆరు మాసాలుగా ఆన్‌లైన్ ద్వారా దేశ, విదేశాలకు విక్రయిస్తున్నారు. దీనికి సంబంధించి గ్రూపు సభ్యులు డీఆర్‌డీఏకు ఇటీవల దరఖాస్తు చేసుకున్నారు. దీంతో కలెక్టర్ స్వయంగా పరిశీలించి గ్రూపు సభ్యులతో మాట్లాడారు. గ్రూపునకు పి.ఎం.ఎఫ్.ఎం.ఇ. ద్వారా రెండున్నరేళ్ల క్రితం రూ.1.18 లక్షల రుణం అందజేశారని సంఘం ఆర్గనైజరు దాసరి ఉజ్వల తెలిపారు. దీనికి ప్రతి నెలా రూ. 3 వేల చొప్పున చెల్లిస్తున్నామని వివరించారు. డీఆర్‌డీఏ పీడీ కె. శచీదేవి, ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, ఎంపీడీవో కె. అప్పారావు, తహసీల్దారు కె. రమాదేవి, వెలుగు ఏపీఎం అప్పలనర్సమ్మ, నాయకులు ఉండూరు దేముడు, లెక్కల కాశీబాబు, మరువాడ ఈశ్వరరావు, పుప్పాల రమేశ్ పాల్గొన్నారు.

సరుగుడు జలపాతాన్ని అభివృద్ధి చేస్తా..

- స్పీకరు చింతకాయల అయ్యన్నపాత్రుడు
- సుందరకోట అననగిరి మధ్య రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



సుందరకోటలో రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న స్పీకరు అయ్యన్నపాత్రుడు

నాతవరం : సరుగుడు జలపాతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతానని అసెంబ్లీ స్పీకరు చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. మావోయిస్టులు ప్రభావిత ప్రాంతమైన సుందరకోట పంచాయతీలో మంగళవారం పర్యటించారు. సుందరకోట నుంచి అసనగిరి గ్రామాల మధ్య రూ 2 కోట్ల 5లక్షల నిధులతో తారురోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చేస్తానని, విద్యుత్ సదుపాయం కల్పిస్తానని, సెల్ టవర్లు కొత్తగా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. గిరిజనులు సాగుచేసుకునే పోడు భూములకు పట్టాలు ఇప్పిస్తానన్నారు. తాండవ రిజర్వాయర్‌లోకి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా పోలవరం కాలువ నీటిని తరలిస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, సర్పంచ్ కొండపల్లి చింతల్లి, నర్సీపట్నం ఆర్డీవో రమణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పీఆర్టీయూ పట్టణ శాఖ అధ్యక్షుడిగా 'దాడి'

అనకాపల్లి: పీఆర్టీయూ పట్టణ శాఖ అధ్యక్షుడిగా దాడి అప్పలనాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక పీఆర్టీయూ కార్యాలయంలో మంగళవారం జరిగిన ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా గొర్లి అర్జున, గౌరవాధ్యక్షునిగా బుద్ధ కాశీ విశ్వేశ్వరరావుతో పాటు మరో 10 మంది కార్యవర్గ సభ్యులుగా నియామకమయ్యారు. ఎన్నికల నిర్వాహకుడిగా పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్ వ్యవహరించారు. ఈ కమిటీ రెండు సంవత్సరాల పాటు కొనసాగుతుందని అప్పలనాయుడు తెలిపారు.

ఫార్మాలో వరుస ప్రమాదాలపై విచారణ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.శంకరరావు

అనకాపల్లి: పరవాడ ఫార్మాసిటీలోని పరిశ్రమల్లో జరుగుతున్న వరుస ప్రమాదాలపై తక్షణం విచారణ జరిపించాలని జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు ఆర్.శంకరరావు డిమాండ్ చేశారు. స్థానిక దొడ్డిరామునాయుడు భవనంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫార్మా కంపెనీలలో ప్రమాదాల నివారణ కోసం ప్రభుత్వ యంత్రాంగం, యాజమాన్యాలు తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలోని వివిధ ఫార్మా కంపెనీల్లో ఈ నెలలోనే వరుస ప్రమాదాలు జరిగాయని, భద్రతా ప్రమాణాలు విషయంలో ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం తేటతెల్లమవుతుందన్నారు. ప్రమాదాలు నివారణకై ముందస్తుగా జరగాల్సిన సేఫ్టీ ఆడిట్‌లో లోపాలు ఉన్నట్లుగా తెలుస్తుందని, కంపెనీలు కార్మికుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయన్నారు.

నేడు పట్టణంలో తాగునీటి సరఫరా బంద్

అనకాపల్లి: స్థానిక జోనల్ పరిధిలో 6 రిజర్వాయర్లకు మంచినీరు అందించే ప్రధాన పైపులైన్ పాడైపోవడంతో బుధవారం పట్టణం పరిధిలో తాగునీటి సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్ తాగునీటి విభాగం ఇంజినీర్ మురళీకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిధిలో ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. గురువారం యథావిధిగా నీటి సరఫరా జరుగుతుందన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 1,392బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,720	5,200
మొదటి రకం	3,630	4,380
రెండో రకం	3,390	3,920
మూడోరకం	3,200	3,370

అనకాపల్లి సినిమాలు

పుష్ప-2	: సత్యనారాయణ స్క్రీన్-1
ముఫాసా	: సత్యనారాయణ స్క్రీన్-2
ముఫాసా	: పర్తిసాయి
బచ్చల మల్లి	: షిర్డీసాయి
జీబ్రా	: వెంకటేశ్వర
అమరన్	: శ్రీసత్య
పుష్ప-2	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 35 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు, బీ పాజిటివ్-10 యూనిట్లు, ఓ పాజిటివ్-19 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్‌ను ఫోన్ నంబర్ 9703619706లో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 422 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 368 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి ఫోన్ నంబర్ 08924-223595లో సంప్రదించవచ్చు.



పట్టణంలో మన్నా చర్చిలో కేక్ కట్ చేస్తున్న క్రైస్తవులు



విద్యుత్ కాంతుల మధ్య ఆర్‌సీఎం చర్చి

చర్చిలకు క్రిస్మస్ శోభ



కశింకోటలో దుకాణంలో అమ్మకానికి ఉంచిన రంగుల నక్షత్రాలు

తుమ్మపాల: క్రిస్మస్ వేడుకలకు **అనకాపల్లి నియోజకవర్గంలోని** చర్చిలు సుందరంగ ముస్తాబయ్యాయి. బుధవారం జరిగే ప్రత్యేక ప్రార్థనల కోసం ఆయా చర్చిల నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. పట్టణంలో ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులో రోమన్ కథోలిక చర్చి, పోలీస్ స్టేషన్ ఎదురుగా ఆర్‌సీఎం(సెంటినరీ బాపిస్టు) చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. లూథరన్ చర్చి, మన్నా చర్చి, పెంతుకోస్టల్ చర్చి, ఇమ్మానుయల్ ప్రార్థన మందిరాల్లోను, మండలంలో తుమ్మపాల, కొత్తూరు. శంకరం, కోడూరు, బీఆర్‌టీ కాలనీ, బవులువాడ, పలు గ్రామాల్లో చర్చిల్లో బుధవారం ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. మంగళవారం రాత్రి నుంచి మొదలైన వేడుకలు బుధవారం రాత్రి వరకు కొనసాగుతాయి. రాత్రి కేక్ కటింగ్ చేసేందుకు ఆయా చర్చిల పాస్టర్లు ఏర్పాట్లు చేశారు.



ఆర్‌సీఎం చర్చిలో తీర్చిదిద్దిన క్రీస్తు మందిరం

వందేళ్ల చరిత్ర సెంటినరీ బాప్టిస్ట్ చర్చి

పట్టణంలో ప్రాచుర్యం పొందిన సెంటినరీ బాప్టిస్ట్ చర్చిని 1898 సంవత్సరంలో స్థాపించారు. ఈ చర్చి 100 ఏళ్లు దాటడంతో శిథిలావస్థకు చేరింది. దీంతో 2009లో పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 2023 నవంబర్ 25న పునః ప్రారంభించారు. ప్రస్తుత కార్యవర్గం అధ్యక్షుడిగా ఎ.జె.మోహన్ దాస్, కార్యదర్శిగా కోరాటి జోసెఫ్, కోశాధికారిగా జి.శేషుకుమార్ వ్యవహరిస్తున్నారు.

కశింకోట: కశింకోటలో క్రిస్మస్ పురస్కరించుకొని



ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారిలో కేథలిక్ సంఘం (చర్చి)లో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

వివిధ రంగుల నక్షత్రాల అమ్మకాలు మంగళవారం జోరుగా సాగాయి. స్థానిక దుకాణాల్లో ప్రత్యేకంగా అమ్మకాలు జరిపారు. మండలంలోని చర్చిలు బుధవారం క్రిస్మస్ వేడుకలకు సిద్ధమయ్యాయి. స్థానిక సంతబయల ఉన్న ఆంధ్ర కల్వరీ సెంటినరీ బాప్టిస్టు చర్చి, గవరపేటలోని ఏసుక్రీస్తు చర్చి, హౌసింగ్ కాలనీ వద్ద షాలెం మందిర్, తదితర చర్చిలను విద్యుద్దీపాలతో అలంకరించారు. క్రిస్మస్ చెట్లను ఏర్పాటు చేశారు. బయ్యవరం , జమాదులపాలెం, ఉగ్గినపాలెం, తాళ్లపాలెం, ఉగ్గినపాలెం,



కశింకోట గవరపేటలోని చర్చికి విద్యుద్దీపాలంకరణ

తేగాడ, తీడ, కొత్తపల్లి, నూతలగుంటపాలెం, నరసింగబిల్లి, చింతలపాలెం, కన్నూరుపాలెం, చెరకాం, అచ్చెర్ల, జి.భీమవరం, పేరంటాలపాలెం, జోగారావుపేట, గొబ్బూరు తదితర గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

అనకాపల్లి: క్రిస్మస్ సందడితో పట్టణ, మండలంలో చర్చిలన్నీ కళకళలాడుతున్నాయి. స్థానిక సెంటినరీ ఆంధ్ర బాపిస్ట్ చర్చ్, కేథలిక్ సంఘం, లూథరన్ చర్చిలతో పాటు చిన్నపెద్ద అన్ని చర్చ్‌లు ముస్తాబయ్యాయి. ప్రధాన చర్చిల్లో మంగళవారం సెమీ



తుమ్మపాలలో వేడుకలకు సిద్ధమైన చర్చి



సంతబయలలో విద్యుద్దీపాల అలంకరణలో ఆంధ్ర కల్వరి సెంచునరీ బాప్టిస్టు చర్చి

క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. చిన్నారులు శాంతాక్లాజ్, మేరీమాత, ఏంజెల్ వేషధారణతో అలరించారు.

దేశ ప్రజలకు అమిత్ షా క్షమాపణ చెప్పాలి



నిరసన తెలుపుతున్న బీఎస్పీ నాయకులు

అనకాపల్లి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ గురించి లోక్‌సభలో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను పదవి నుంచి తొలగించాలని బీఎస్పీ నియోజకవర్గ కన్వీనర్ సూదికొండ మాణిక్యాలరావు డిమాండ్ చేశారు. స్థానిక నెహ్రూచౌక్ వద్ద బీఎస్పీ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అట్టడుగు, అణగారిన వర్గాల ప్రజలకు స్వేచ్ఛ సమానత్వం సామాజిక హక్కులు కలిగించేందుకు తన జీవిత కాలం పోరాటం చేసిన మహనీయుడు అంబేడ్కర్‌ని కొనియాడారు. అటువంటి వ్యక్తి గురించి అమిత్ షా అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. దీనిని ప్రతి ఒక్కరూ తీవ్రంగా ఖండించాలన్నారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరణం తిరుపతిరావు మాట్లాడుతూ అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు లంబా శ్రీనివాసరావు, సూరిశెట్టి రామచంద్రరావు, దళిత సంఘాల ఐక్యవేదిక నాయకుడు ఎం.చంద్రశేఖర్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనకాపల్లి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

డీపీఎన్ జెడ్పీ హైస్కూల్‌లో స్టడీ మెటీరియల్ పంపిణీ



టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న పూర్వ విద్యార్థులు

కశింకోట: స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూలు టెన్త్ విద్యార్థులకు పూర్వ విద్యార్థులు ఉచితంగా స్టడీ మెటీరియల్ మంగళవారం పంపిణీ చేశారు. పూర్వ విద్యార్థులు కె.వి.కామేశ్వరరావు, ఒ.వి.ఎల్.ఎన్.మూర్తి, ఎస్.గౌస్ మొహిద్దీన్, తాకాశి శ్రీనివాసరావు సమకూర్చిన సుమారు రూ.30 వేలు చేసిన స్టడీ మెటీరియల్‌ను 100 మంది విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.ఆర్.వి.ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముఠా కార్మికులకు కూలీ రేట్లు పెంచాలి



సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముఠా కార్మికులు

అనకాపల్లి: ముఠా కార్మికుల కూలీ రేట్లు పెంచాలని ముఠా కార్మికుల సంఘం(సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈ నెల 26న తలపెట్టిన కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలని పట్టణంలో ముఠా కార్మికుల సంఘాల నాయకులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 మాసాల క్రితం ముఠా కార్మికులకు కూలీ రేట్ల పెంపుపై ఒప్పందం జరిగిందని గుర్తు చేశారు. తక్షణం కూలీ రేట్లు పెంచాలని వర్తక సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు, షాపు యజమానులకు తెలియజేసినప్పటికీ సరైన సమాధానం లేకుండా పోయిందన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు జీతాలు పెంచాలని కోరారు. ఇంటి అద్దెలు, కరెంట్ బిల్లులు, విద్య, వైద్యం ఖర్చులు విపరీతంగా పెరిగాయని, ఈ నేపథ్యంలో ఉన్న కూలీ రేట్లను వంద శాతం పెంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వర్తక సంఘం 13 శాతానికి పెంచుతామని చెబుతున్నారని, దీనిని ఎట్టి పరిస్థితిలో అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. మూడు దఫాలుగా జరిగిన చర్చల్లో పురోగతి లేకపోవడంతో కార్మికులు లోడింగ్, అన్‌లోడింగ్ పనులను నిలిపి చేసి సమ్మె చేయాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు గంటా శ్రీరామ్, బీశెట్టి అప్పారావు, అధ్యక్ష, కార్యదర్శులు కాపుశెట్టి అప్పారావు, సురేష్, సభ్యులు నాయుడు, ఈశ్వరరావు, వి.సాయి, తదితరులు పాల్గొన్నారు.

వదలని వరుణుడు



వరిపనలను కుప్పలుగా పెడుతున్న రైతు

తుమ్మపాల: ఈ నెల 26 వరకు విస్తారంగా వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికల నేపథ్యంలో రైతుల్లో మళ్లీ అలజడి మొదలైంది. చేతికందిన వరి పంట చేజారిపోతుందనే ఆందోళనలతో శరవేగంగా కోతలు కోసి కుప్పలు పెడదామన్న రైతులకు తీవ్ర వర్షాలు చేదు అనుభవాన్ని మిగిల్చుతున్నాయి. కోసిన వరి పనలు నీటి మునిగి మొలకెత్తే దశకు చేరడంతో తీవ్ర ఆందోళనలకు గురవుతున్నారు. రెమాల్ తుపాను గండం తప్పిందనుకున్న కొంత సమయానికే వాతవరణ శాఖ మరో అల్పపీడనం హెచ్చరికను సోమవారం ప్రకటించడంతో రైతులు పొలాల్లోని వరి పనలను ఎక్కడికక్కడే గాలి కుప్పలుగా పెట్టారు. పొలాల్లో నీరును తొలగించి పనలను ఎత్తు ప్రాంతాలకు తరలిస్తున్నారు. రెండు రోజులు గడువు ఉంటే చాలు కోసిన పనలను కుప్పలుగా పెట్టుకుంటామని, ఆ సమయం కూడా దొరకడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. కుటుంబంలో అందరూ పొలాలకు చేరి వరి చేనును సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ మొదలు నుంచి కష్టాలు తప్పలేదని, చివరకు పంట చేతికి వచ్చిందనుకున్న సమయంలో కూడా కష్టాలు పడాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతోనే గర్భిణి మృతి

నర్సీపట్నం : ఏరియా ఆసుపత్రిలో నిండు గర్భిణి వైద్యులు నిర్లక్ష్యం వల్లనే ప్రాణాలు కోల్పోయిందని బీఎస్పీ నియోజకవర్గ కన్వీనర్ బొట్టా నాగరాజు పేర్కొన్నారు. తల్లి, బిడ్డ ప్రాణాలను వైద్యులు బలికొనడం బాధకరమన్నారు. మృతికి కారకులైన వైద్యులు, వైద్య సిబ్బందిని తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. గర్భిణి మృతి చెందినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

నేడు కనకమహాలక్ష్మి సారె ఊరేగింపు

కశింకోట: కశింకోటలోని గవరపేటలో కనకమహాలక్ష్మి అమ్మవారికి బుధవారం సాయంత్రం సారె ఊరేగింపు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు భీశెట్టి కుమార్, ఉపాధ్యక్షుడు వేగి సన్యాసినాయుడు తెలిపారు. మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. ఈ సందర్భంగా ట్రాక్టర్‌ను అందంగా అలంకరించి దానిపై అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి, కోలాటాల నడుమ సారెను ఊరేగిస్తామన్నారు. ఈ నెల 26న ఆఖరి గురువారం పురస్కరించుకొని అధిక సంఖ్యలో రానున్న భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశామన్నారు. ఆ రోజు మధ్యాహ్నం ఆలయం వద్ద పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు.

కోతలు వాయిదా వేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఆర్ సీహెచ్.ముకుందరావు

అనకాపల్లి: వర్ష సూచన ఉన్నందున వరి కోతలను వాయిదా వేసుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్.ముకుందరావు సూచించారు. స్థానిక ఆర్‌ఏఆర్‌ఎస్ కార్యాలయంలో మంగళవారం శాస్త్రవేత్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే పైరును కోసి ఉంటే కుప్పలుగా పెట్టుకోవాలన్నారు. కోసిన పైరు తడిచినట్లయితే పనలను తిప్పి ఆరబెట్టి గింజ మొలకరాకుండా, రంగు మారకుండా ఉండటానికి ఎకరాకు 50 కిలోల ఉప్పునీటి పిచికారీ చేయాలన్నారు. రైతులు వర్షాల అనంతరం తేమను ఉపయోగించుకుని నేలను తయారు చేసి రాగి నారు వేసుకోవచ్చన్నారు. వరి తరువాత నువ్వు పంట సాగు చేసుకునే రైతులు వైఎల్‌ఎం 66 రకాన్ని ఎకరాలకు 2 కిలోల విత్తనాన్ని, కార్బెన్డజియ్ 1 గ్రాము కిలో విత్తనానికి వాడి విత్తన శుద్ధి చేసి విత్తుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్తలు వి.గౌరీ, పి.వి.పద్మావతి, ఎ.అలివేణి పాల్గొన్నారు.

బాలల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

రాంబిల్లి(యలమంచిలి): బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాంబిల్లి ఎంపీడీవో జయమాధురి, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ ప్రాజెక్ట్ డైరెక్టర్ అనంతలక్ష్మి, సీడీపీవో ఇందిరాదేవి కోరారు. రాంబిల్లి మండలంలో పంచదార్ల గ్రామంలోని తుపాను షెల్టర్‌లో మంగళవారం కిశోరి బాలికా వికాసంపై మండలంలో అంగన్‌వాడీ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, పోలీసులు, వివిధ శాఖల సిబ్బందికి శిక్షణా తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలల హక్కులు, బాలికల సంరక్షణ, బాల్య వివాహాలు, అఘాయిత్యాలు, లైంగిక వేధింపులు, దాడులను ఏవిధంగా ఎదుర్కోవాలో పాఠశాలల్లో, గ్రామాల్లో అవగాహన కలిగించాలన్నారు. అప్పుడే కిశోరి బాలిక వికాసం లక్ష్యం నెరవేరుతుందన్నారు. అంతకు ముందు కిశోరి వికాసంపై పోస్టర్ ఆవిష్కరించి, ప్రతిజ్ఞ చేశారు. మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దిమిలి వైద్యాధికారి వెంకటేష్, ఈవోపీఆర్‌డీ సన్యాసిరాజు, ఎంఈవో సూర్యారావు, జిల్లా బాలల హక్కుల పరిరక్షణ కమిటీ ప్రతినిధి డి.లోవరాజు, రాంబిల్లి హెచ్‌ఎం వేణుగోపాల్, సూపర్‌వైజర్‌లు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా ధనుర్మాసోత్సవాలు

నక్కపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు నేత్ర పర్వంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకం చేశారు. కొండ దిగువన క్షేత్రపాలకుడు వేణుగోపాల స్వామి సన్నిధి, ఉత్సవమూర్తులు, గోదాదేవి సన్నిధి, ఉపాలయాల్లో నిత్య పూజలు నిర్వహించిన అనంతరం అర్చక బృందం శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీవేంకటేశ్వరస్వామిని హంస వాహనంపైన, గోదాదేవి అమ్మవారిని పల్లకిలో ఉంచి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. అనంతరం గోదాదేవి అమ్మవారి మూలవిరాట్ సన్నిధిలో తొమ్మిదో పాశురాన్ని విన్నపం చేశారు. అమ్మవారికి ప్రత్యేక నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు.



హంస వాహనంపై స్వామికి తిరువీధి సేవ నిర్వహిస్తున్న అర్చకులు

ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్, అర్చక స్వాములు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

వేట విరామ పరిహారం కోసం ఆందోళన



రాంబిల్లిలో ఆందోళన చేస్తున్న మత్స్యకార సంఘం నాయకులు

రాంబిల్లి(యలమంచిలి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా మత్స్యకారులకు వేట విరామ పరిహారం నేటికీ అందజేయలేదని, తక్షణం పరిహారం అందించి ఆదుకోవాలని రాంబిల్లి మత్స్యకార సంఘం నాయకులు చింతకాయల శివాజీ, చోడిపిల్లి గంగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం రాంబిల్లి మండలంలో మత్స్యకారులకు మత్స్యకార భరోసా అందడంలో జాప్యంపై వాడపాలెం గ్రామంలో ఆందోళన చేశారు. అనంతరం మత్స్యకారుల సమస్యలపై రాంబిల్లి డిప్యూటీ తహసీల్దారు వెంకట్‌కు స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మత్స్యకారులకు ప్రతి సంవత్సరం విధిగా మత్స్యకార భరోసా అకౌంట్‌లో జమ అయ్యేదని గుర్తు చేశారు. సకాలంలో సాయం అందక మత్స్యకారులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గరికిన అప్పలరాజు, సిహెచ్.పోతురాజు, ఎస్.ముసిలిరావు, చోడిపిల్లి అప్పలరాజు, కె.వెంకటేష్, సత్తిబాబు, సిహెచ్.జగ్గా, జి.నూకరాజు పాల్గొన్నారు.

'అభిజిత్' మహిళా కార్మికులకు బకాయిలు చెల్లించాలి

అచ్యుతాపురం: అభిజిత్ లేఆఫ్ ఒప్పందం కార్మికులందరికీ అమలు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం అచ్యుతాపురంలో తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము, మండల కన్వీనర్ కె.సోమునాయుడు మాట్లాడుతూ గత అక్టోబర్ 13న లే ఆఫ్ ప్రకటించిన అభిజిత్ కంపెనీ కార్మికులకు బోనస్, బకాయిలు చెల్లించేందుకు అంగీకరించిందని తెలిపారు. ఆ ఒప్పందం మేరకు మెటల్ కొట్టే మహిళా కార్మికులకు మాత్రం ఎటువంటి బకాయిలు చెల్లించలేదన్నారు. లే ఆఫ్ మేరకు మహిళా కార్మికుల కచ్చితంగా బకాయిలు ఇవ్వాలని, లేకుంటే భారీ ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. యూనియన్ నాయకులు కామేశ్వరి, రాజాన అమ్మాజీ, సూరంపూడి తలుపులమ్మ, రాజాన చిన్నమ్మ, లాలం లక్ష్మి, నూకరత్నం పాల్గొన్నారు.